క్లుప్తంగా

చిన్నారులకు ప్రథమ దివ్య సత్ప్రసాదం



సత్ప్రసాదం తీసుకున్న చిన్నారులతో ఫాదర్ జ్వ్యాన్నేసు, సిస్టర్లు

వైరా: వైరాలోని శాంతినగర్‌లో గల హోలీ ట్రినిటీ చర్చిలో ఆదివారం చిన్నారులకు ప్రథమ దివ్య సత్ప్రసాదం స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ జ్వ్యాన్నేసు దివ్యబలి పూజ సమర్పించి 18మంది చిన్నారులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ సిస్టర్లు సుమ, ప్రదీప, జెసింత పాల్గొన్నారు.

మెడికల్ షాపుల నూతన కార్యవర్గం ఎన్నిక



మీనవోలులో ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఎర్రుపాలెం: మండలంలోని మెడికల్ షాపుల నూతన కార్యవర్గం (కెమిస్ట్ – డ్రగ్గిస్ట్) ఎన్నిక ఆదివారం మీనవోలు గ్రామంలోని నాలెడ్జ్ సెంటర్‌లో జరిగింది. నూతన కార్యవర్గం మండల అధ్యక్షుడిగా కర్నాటి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శీలం చిన్న హనుమంతరెడ్డి, మానికొండ కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పత్తిపాటి భాస్కరరావు, కోశాధికారిగా కేతేపల్లి ఫణికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మల్లారపు గోపాలరావు, బండారు ఆంజనేయులు లను ఏకగ్రీవంగా ఎన్నుక చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ షాపుల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే బాజీ, తదితరులున్నారు.

మసీదు కమిటీ అధ్యక్షుడిగా మస్తాన్



మస్తాన్

తల్లాడ: తల్లాడ మసీదు కమిటీ అధ్యక్షుడిగా షేక్ మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తల్లాడ మసీదులో షేక్ యూసుఫ్ సమక్షంలో జరిగిన కమిటీ సమావేశంలో ముస్లిం సోదరులు కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా షేక్ నిజాముద్దీన్, మండల కమిటీ సభ్యులుగా షేక్ మెహరాజ్, సైదా, యాకూబ్‌పాషా, షబ్బీర్ పాషా, బడేమియా, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక

చింతకాని: నూతనంగా ఎన్నికైన టీడీపీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శుల వివరాలను టీడీపీ మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు ఆదివారం వెల్లడించారు. పాతర్లపాడు గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లూరి శేషయ్య, కార్యదర్శి టేకుమట్ల వీరబాబు, తిమ్మినేనిపాలెం సామినేని అప్పారావు, కూచిపూడి ఉమారావు, చింతకాని మల్లెల సత్యనారాయణ, తూము తిరపయ్య, వందనం షేక్ జహార్, కొండా దుర్గాశంకర్, నాగిలిగొండ చాగంటి కిషోర్, కొనకంచి లక్ష్మీనారాయణ, ప్రొద్దుటూరు పెంట్యాల రామారావు, పుచ్చకాయల వెంకటనర్సయ్య, అనంతసాగర్ పాకనాటి నర్సిరెడ్డి, వేల్పుల సైదులు, నర్సింహాపురం పండగ నాగేశ్వరరావు, జల్లి ఉపేందర్, బస్వాపురం బద్దుల మల్లయ్య, కన్నెబోయిన పుల్లయ్య, బొప్పారం షేక్ సోందు సాహెబ్, బొల్లిగొర్ల వీరస్వామి, జగన్నాధపురం కేతబోయిన సురేష్, షేక్ బాషా, లచ్చగూడెం గురిజాల మాధవరావు, గంట సత్యనారాయణ, నేరడ పటాన్ సోందుఖాన్, పగిళ్లపల్లి ఉప్పలయ్య, సీతంపేట షేక్ నాగూర్, కప్పల ఉపేందర్ రావు ఎన్నికైనట్లు తెలిపారు.

ముమ్మరంగా పొడి దుక్కులు



పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం

ముదిగొండ: మండలంలో అక్కడక్కడ రైతులు ముమ్మరంగా పొడి దుక్కులు దున్నుతున్నారు. కొంతమంది రైతులు పొలాల్లోని చెత్తా చెదారం తొలగించి, శుభ్రం చేస్తున్నారు. మరికొంతమంది చొప్ప దంటులను కాల్చివేస్తున్నారు. సరైన వర్షాలకు ముమ్మరంగా వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారు.

నేడు జీలుగు విత్తనాల పంపిణీ

తల్లాడ: తల్లాడ ప్రాథమిక వ్యవసాయ సహకారి పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు సొసైటీ కార్యదర్శి నాగబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు అందిస్తామని, 30 కేజీల బస్తా రూ.2,137 కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెరవేరనున్న సొంతింటి కల

- పైలట్ ప్రాజెక్ట్‌గా చిన్నగోపతి
- యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



లబ్ధిదారురాలికి పత్రం ఇస్తున్న భట్టి, కలెక్టర్, ఎమ్మెల్యే (ఫైల్)



చిన్నగోపతిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

కొణిజర్ల: అధికారంలోకి రాగానే అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుంది. దీనిలో భాగంగా మండలానికో గ్రామాన్ని పైలెట్‌ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. దీంతో లబ్ధిదారుల సొంతింటి కల నేరవరనున్నందున వారి ఆనందాలకు అంతేలేకుండా పోయింది.

53మంది లబ్ధిదారుల ఎంపిక..

పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన చిన్నగోపతిలో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వే నిర్వహించి 53మంది ఇళ్లలేని లబ్ధిదారులను గుర్తించి.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఎంపిక చేశారు. వీరందరికి జనవరి 26న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇంటి మంజూరు పత్రాలు అందజేయడం జరిగింది. ఈ మేరకు ఆయా లబ్ధిదారులు యుద్ధ ప్రతిపాదికన ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు.

విడతల వారీగా మంజూరు వివరాలిలా..

ప్రభుత్వం మొదటి విడత కింద రూ.లక్ష, రెండో విడత రూ.1.25 లక్షలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఇప్పటి వరకు 42మంది ఇంటి నిర్మాణాలు మొదలు పెట్టగా.. మిగిలిన వారు కూడా నిర్మాణాలు మొదలు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్థికంగా వెసులుబాటు లేని నిరుపేదలకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ఎంటువంటి ఆటంకాలు లేకుండానే తమ ఇంటి నిర్మాణాలు పూర్తిఅవుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ప్రకారమే..

ప్రతి లబ్ధిదారుడు కూడా 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపే నిర్మాణాలు చేపట్టాలని అలా లేని పక్షంలో బిల్లు మంజూరు కాదని ప్రభుత్వం ఆంక్షలు పెట్టడంతో జాగ్రత్తగా ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నారు. బిల్లుల మంజూరు విషయంలో కూడా మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం చేతుల మీదుగా బిల్లు అందుకున్నా..



అన్ని నియోజకవర్గాలనుంచి ఎంపిక చేసిన లబ్ధిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మొదటి బిల్లు రూ.లక్ష ఇచ్చే సమయంలో.. వైరా నియోజకవర్గం నుంచి నా పేరు ఎంపిక చేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి, పొంగులేటి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చేతులమీదుగా చెక్కు అందుకున్నా. చాలా సంతోషంగా ఉంది.

– లింగాల నీలిమ, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు చిన్నగోపతి

ఇబ్బందులు తప్పాయి..



ఇప్పటి వరకు ఒక్క గదిలో ఇబ్బందులు పడుతూ రోజులు గడిపాము. కాంగ్రెస్ ప్రభుత్వం అన్న మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మొదటి విడత బిల్లు రూ.లక్ష ఎకౌంట్‌లో పడ్డాయి. ఇన్ని రోజులు పడ్డ ఇబ్బందులు తొలిగిపోతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు

– కొచ్చెర్ల పద్మ, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు, చిన్నగోపతి

అందుబాటులో విత్తనాలు

మధిర: మధిర సొసైటీలో జీలుగులు, జనుము విత్తనాలు ఈనెల 26 నుంచి సబ్సిడీపై పంపిణీ చేస్తారని మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల జీలుగు బస్తా రూ.2,138 , జనుము 40 కేజీల బస్తా రూ.2,510 ధర చెల్లించాలన్నారు. పట్టాదారు పాస్బుక్, ఆధార్ జిరాక్స్ తీసుకొని ఏఈఓ వద్ద ఆన్ లైన్ కూపన్ తీసుకొని సొసైటీకి వెళ్లి విత్తనాలు పొందాలని సూచించారు. 26న మడుపల్లి, 27న రాయపట్నం, 28న మధిర, నక్కలగరుబు, దిడుగుపాడు, ఆత్కూరు గ్రామాల పరిధిలోని రైతులు విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. 29న మల్లారం, జాలిముడి, రామచంద్రాపురం, యండపల్లి, 30న సిరిపురం, మునగాల, వంగవీడు, 31న మాటూరు, మాటూరుపేట గ్రామాల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యావసరాలు అందజేత



సరుకులు అందిస్తున్న స్నేహితులు

ముదిగొండ: మండలపరిధిలోని బాణాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ స్నేహితులు విజయ్, వెంకటేష్‌లకు ఆదివారం రూ.13వేలు విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. స్నేహితులు ఇరువురు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సరుకులు అందజేశారు.

అ'పూర్వ' సమ్మేళనం

ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధలు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా పూర్వ విద్యార్థులు సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. – ఏన్కూరు



అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

మల్లవరం పోలీసుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మల్లవరం పోలీసులు

తల్లాడ: వివిధ బ్యాచ్‌ల్లో పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికై పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న మల్లవరం గ్రామానికి చెందిన పోలీసులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విధి నిర్వహణలో ఎప్పుడు బీజీగా ఉండే గ్రామానికి చెందిన పోలీస్ యువకులంతా తల్లాడలోని ఓ మామిడి తోటలో కలుసుకొని రోజంతా ఉత్సాహంగా గడిపారు. మల్లవరం గ్రామానికి చెందిన యువకులు పోలీసులు ఉద్యోగాలు సాధించడంలో గత రెండు మూడు దఫాలుగా వెలువడుతున్న ఫలితాల్లో ముందంజలో ఉంటున్నారు. అంతే కాకుండా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందించడం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పసుపులేటి ప్రసాద్, గాదె రంజిత్, విష్ణు, దుగ్గిదేవర ముత్యాలరావు, కొండ, ఉద్దగిరి సాంబశివరావు, నరసింహరావు, ఎర్రి అంకంరావు, కుంచం సైదులు, నంద్యాల హనుమంతురావు పాల్గొన్నారు.

చల్లగా చూడమ్మా పెద్దమ్మతల్లి



పెద్దమ్మతల్లితో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న నాయకపోడు గిరిజనులు

సత్తుపల్లిటౌన్: వానలు కురిసి, పంటలు సంవృద్ధిగా పండడంతో పాటు అందరినీ చల్లగా చూడమ్మా పెద్దమ్మ తల్లి అంటూ నాయకపోడు గిరిజనులు పెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడులోగల పెద్దమ్మ తల్లి తిరునాళ్ల జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లిను ఘనంగా ఊరేగింపు నిర్వహించి, నిప్పుల గుండంలో నుంచి పెద్దమ్మ తల్లిను గద్దెనెక్కించారు. ఆ తర్వాత కోళ్లు, మేకలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆచార సాంప్రదాయంగా వేరతాడుతో చేతులపై గణాచారులతో కొట్టించుకొని భక్తిను చాటుకున్నారు. దీంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో పూజారి ధర్మారావు, గంటా వసంతరావు, మారుతీ బాబురావు, మారుతీ సూరిబాబు, పూచి గోవర్ధన్, భోగి వీరస్వామి, పూచి భాస్కర్‌రావు, వనమాల రాజశేఖర్, రవి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృత్యువాత

మధిర: మండల పరిధిలోని రొంపిమల్ల గ్రామానికి చెందిన రైతు సిరియాల నరసింహారావుకు చెందిన గొర్రె మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఆదివారం మృత్యువాతకు గురైంది. పొలానికి మేతకు వెళ్లిన గొర్రె సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ తీగ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గొర్రెల కాపరికి సంబంధిత అధికారులు నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'జీవ పరిణామం' అంశంపై సెమినార్



మాట్లాడుతున్న పల్లా కొండల్‌రావు

బోనకల్: స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్జీవం, జీవపరిణామం అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సదర్భంగా సీపీఎం జిల్లా రాజకీయ విద్యావిభాగం నాయకుడు పల్లా కొండల్‌రావు మాట్లాడుతూ.. నిర్జీవం నుంచి జీవం ఆవిర్భవించిందని, జీవవైవిద్యం పదార్థ లక్షణాలను అధ్యయనం చేయడం ద్వారా సైన్స్ సమాజాన్ని నిర్మించగలమన్నారు. రష్యన్ శాస్త్రవేత్త ఏఐ ఓపారిన్ జీవోత్పత్తి గుట్టు విప్పాక.. సృష్టివాదులు, వాడు సృష్టించిన దేవుళ్ల, దేవుళ్లు సృష్టించిన జీవుల కథల్లో సత్యం లేదని తేట తెల్లమైందన్నారు. ఆ తరువాత జరిగే శాస్త్ర పరిశోధనలు ఓపారిన్ చెప్పిన మాటలను బలపరచడం జరిగిందన్నారు. జీవపదార్థంలో కణం కీలకమైందని, కొన్ని లక్షల కణాలపై జీవుల శరీరంలో అవయవాలు ఏర్పడుతాయన్నారు. సెమినార్‌లో యూటీఎఫ్ నాయకులు గుగులోత్ రామకృష్ణ, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, జొన్నలగడ్డ సునీత, తెల్లాకుల శ్రీను, అప్పాచారి, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణ ప్రజలు

సత్తుపల్లి: పెహల్గాం దాడికి ప్రతీకారంగా కేవలం 22 నిముషాల్లో మహిళా కేడర్ ఆఫీసర్‌తో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి పాకిస్తాన్‌కు గట్టి హెచ్చరిక చేసిన భారత సైన్యానికి సెల్యూట్ చేస్తూ సత్తుపల్లి పట్టణంలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కులాలకు, పార్టీలకతీతంగా హాజరై జాతీయ జెండాను చేబూని భారత్ మాతాకు జై, జై జవాన్, జై కిసాన్ నినాదాలతో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా నంబూరి రామలింగేశ్వర్‌రావు, ఈవీ రమేష్, మాట్లాడుతూ.. దేశంపై ఎవరు కుట్రలు చేయాలని చూసినా దేశ సమైక్యతకు సమగ్రతకు భంగం కలిగించాలని చూసిన ప్రధాని మోదీ తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు సాలీష్ శివ, వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, రమేష్, మాధురి మధు, దీన్ దయాళ్, కోరుకొండ వెంకటేశ్వరరావు, మట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

ఆహా అనేలా రిజర్వాయర్ అందాలు



వైరా రిజర్వాయర్ అందాలు చూడతరమా అన్నట్టుంది ఈ చిత్రం. వైరా రిజర్వాయర్‌లో ప్రస్తుతం 14.2 అడుగుల మేర నీరు ఉంది. పగలంతా సూర్యుడు ఎండ వేడిమితో తన ప్రతాపాన్ని చూపించగా అస్తమించే సమయంలో సూర్యకిరణాలు రిజర్వాయర్ నీటిపై పడుతుంటే ఆ అందాలు చెప్పనలవి కానివి. సాయంత్రం వేళలో ఈ అందాలు చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతుంటారు. ఆదివారం సాయంత్రం ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. - వైరా

రోడ్లు సరే.. వంతెనలేవి..?

- మండలంలో నిర్మించని చప్టాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు



న్యూలక్ష్మీపురంలో చప్టా లేక ప్రధాన రహదారిపై నిలిచిన నీరు



పెద్దమండవ - గంధసిరి రహదారి మధ్యలో వాగు

ముదిగొండ: గత 15ఏళ్లగా నిర్మాణాలకు నోచుకోకుండా అధ్వానంగా ఉన్న మండలంలోని 15గ్రామాల రహదారులు.. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రూపురేకలు మార్చింది. ఇదే కాకుండా మధిర నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రోడ్లన్నింటినీ రూ.కోట్లు ఖర్చుచేసి బీటీ రహదారులుగా మార్చింది. కానీ వంతెనలు మాత్రం కట్టలేదు.

చేపట్టాల్సిన వంతెనలు..

మండలంలోని గందసిరి–పెద్దమండవ, మల్లారం –పెద్దమండవ, గంధసిరి–బాణాపురం, న్యూలక్ష్మీపురంతో పాటు మరో ఐదు గ్రామాల్లోని బీటీ రహదారులపై చప్టాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ప్రతిపాదనలు అమలులో ఉన్నా, నిధులు పుష్కలంగా ఉన్నా గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడంలేదు.

ఈ రహదారులపై రాకపోకలు సాగించడానికి అనుకూలంగా, దూర ప్రయాసలు తగ్గించే మార్గాలుగా ఉన్నాయి. వర్షాకాలంలో రైతులు, ప్రయాణికులు వెళ్లాలంటే ఇబ్బంది పడకుండా వాగుల వద్ద వంతెనలు నిర్మిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

ప్రతి సంవత్సరం వర్షాకాలంలో న్యూలక్ష్మీపురంలోని రహదారిపై చప్టా నిర్మాణం లేక ఇళ్లల్లోకి వర్షపు వరద చేరుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. చప్టాల నిర్మాణాలు చేపట్టాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు గతంలో ఎంపీకి, మధిర ఎమ్మెల్యే సమస్యలు వివరించినా.. ప్రస్తుతం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టిలో ఉన్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆరోపిస్తున్నారు. చాప్టాలతో పాటుగా ముదిగొండ – చిర్రుమర్రి రోడ్డు కూడా మెరుగుపరచాలని ముదిగొండ మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి..



అధ్వానంగా తయారైన రహదారులన్నీ బీటీలుగా మార్చినా వంతెనలు మాత్రం నిర్మించలేదు. దీంతో పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. పెద్దమండవ నుంచి ఖమ్మం వెళ్లేందుకు ఈ వాగుపై నుంచే వెళ్లాలి.. ఒక వేళ వాగు పొంగిందటే ఇక రాకపోకలు బంద్. చిరుమర్రి వద్ద చప్టా పనులు రెండేళ్లుగా సాగు...తూనే ఉన్నాయి. సమస్యను ప్రభుత్వంకానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం త్వరితగతిన వంతెనలు నిర్మించి ఆదుకోవాలి.

– కనగాల వెంకటేశ్వర్లు, రైతు, పెద్దమండవ

ఇళ్లలోకి వర్షపునీరు చేరుతోంది..



రోడ్ల మరమ్మతుల పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేస్తున్నారు. ప్రతి సంవత్సరం వానాకాలంలో రోడ్డుపైకి వరద నీరు చేరడంతో వరద నీరంతా ఇళ్లలోకి చేరుతుంది. దీంతో మేమంతా అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం శూన్యం. డిప్యూటీ సీఎంకు కూడా విన్నవించాం. ఇకనైనా రోడ్డు పనులు పూర్తిచేయడంతో పాటు చప్టా నిర్మాణాలు చేపట్టి రాకపోకలు జరిగేలా చూడాలి.

– గందు సురేష్‌యాదవ్, న్యూలక్ష్మీపురం